## క్లుప్తంగా

### గ్రామాల అభివృద్ధే కాంగ్రెస్ ధ్యేయం



స్వీట్లు పంపిణీ చేస్తున్న గ్రామస్తులు

**కాల్వశ్రీరాంపూర్:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్ అన్నారు. మండలంలోని కూనారం-పెద్దరాతుపల్లి గ్రామాల మధ్య తారురోడ్డు మంజూరవడంపై ఇరు గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం కూనారం గ్రామంలో మాజీ ఎమ్మెల్యే గీట్ల ముకుందరెడ్డి విగ్రహం వద్ద స్వీట్లు పంపిణీ చేశారు. దశాబ్దాల నుంచి ఎదురు చూసిన ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుకు ఇరుగ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి గిరిజన సంక్షేమశాఖ నుంచి ప్రభుత్వం రూ.10కోట్లు మంజూరీ చేసిందని నాయకులు తెలిపారు. ప్రభుత్వానికి, ఎమ్మెల్యేకు ఈప్రాంత ప్రజలు రుణపడి ఉంటారని, ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు సారయ్యగౌడ్ పేర్కొన్నారు. ఏఎంసీ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్యాయాదవ్, మాజీ ఎంపీటీసీ సాధన, రాజేశ్వరి, కొమురయ్య, వెల్తూరి రమేశ్, మాజీ సర్పంచులు ఓరుగంటి కొమురయ్యగౌడ్, మాదాసు సతీశ్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### అర్హులకు రేషన్‌కార్డుల పంపిణీ



కార్డులు పంపిణీ చేస్తున్న సుధాకర్

**రామగుండం:** అంతర్గాం మండల పరిధిలోని ఆకెనపల్లిలో వందమంది అర్హులైన లబ్ధిదారులకు రేషన్‌కార్డులు జారీ అయ్యాయి. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు ఆదివారం కాంగ్రెస్ కోఆర్డినేటర్ గాదె సుధాకర్ లబ్ధిదారులకు అందజేశారు. లబ్ధిదారులు మంథని మహేందర్, ఐలవేణి అనసూర్య, మర్రి రాజ్‌కుమార్, బరిగెల భీమయ్య, బరిగెల సతీశ్, కనకయ్య, రేండ్ల సాగర్, ఐలవేణి నగేశ్, సొల్లు పోశం, గెల్లు కొమురయ్య, శ్రీరాముల శ్రీకాంత్ ఉన్నారు.

### జీఎస్టీ తగ్గింపుపై హర్షం



క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ శ్రేణులు

**రామగిరి:** పేద, మధ్య తరగతి కుటుంబ భారాన్ని తగ్గించే విధంగా నిత్యావసర వస్తువులపై, ఆటోమొబైల్స్ అనేక విభాగాల్లో జీఎస్టీని తగ్గించడంపై హర్షిస్తూ ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు కొండు లక్ష్మణ్ అధ్యక్షతన ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి తొట్ల రాజు, ఉపాధ్యక్షుడు నాంసాని మహేశ్, పట్టణ అధ్యక్షుడు చిదురాల శివప్రసాద్, మహిళా అధ్యక్షురాలు రొడ్డ వరలక్ష్మి, నాయకులు ఎండీ జానీ, గసిరెడ్డి నాగరాజు, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పోషకాహారంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు


**రామగిరి:** లయన్స్ క్లబ్ ఆఫ్ సెంటినరీకాలనీ ఆధ్వర్యంలో ప్రకృతి వైద్య నిపుణురాలు డాక్టర్ శరణ్యయాదవ్ ఆధ్వర్యంలో పోషకాహారంపై ఆదివారం స్థానిక మార్కెట్ చౌరస్తాలో అవగాహన కల్పించారు. పోషకాహారం అంటే శరీరానికి కావాల్సిన విటమిన్లు, మినరల్స్, ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వులు సమపాళ్లలో ఉన్న ఆహారమే నిజమైన పోషకాహారమని లయన్స్‌క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ పాస్ట్ ప్రెసిడెంట్ ముల్మూరి శ్రీనివాస్, డైరెక్టర్, మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి, సభ్యులు కళాధర్‌రెడ్డి, అసం తిరుపతి, ఒర్రె మల్లయ్య పాల్గొన్నారు.

**నేడు జోనల్‌స్థాయి క్రీడలు ప్రారంభం**

**సుల్తానాబాద్:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం జోనల్‌స్థాయి క్రీడలు ప్రారంభం కానున్నట్లు ఎంఈవో ఆరెపల్లి రాజయ్య, ఎస్‌జీఎఫ్ జోనల్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రణయ్, దాసరి రమేశ్ తెలిపారు. సుల్తానాబాద్ పాత తాలూకా పరిధిలోని మండలాల విద్యార్థులు మండల స్థాయిలో ఎంపికైనవారు పాల్గొనాలని వారు కోరారు.

# పెద్దచెరువుపై పట్టింపేది?

- బూడిద, పూడికతో నిండిపోతున్న వైనం
- ప్రతిపాదనలకే పరిమితమైన మినీ ట్యాంక్‌బండ్



రామగుండం పెద్ద చెరువు

**రామగుండం:** రామగుండం పట్టణ నడిబొడ్డున ఉన్న చెరువు నియోజకవర్గంలోనే అధిక విస్తీర్ణం కలిగిన చెరువు. అర్బన్, రూరల్‌కు చెరువు అనుసంధానంగా ఉండడంతో, ఈ నీటితో పలు గ్రామాల రైతులు సాగుతో లబ్ధి పొందుతున్నారు. రామగుండం శివారు సర్వే నంబర్ 412లో 217 ఎకరాల విస్తీర్ణంలో చెరువు శిఖం ఉన్నట్లు రెవెన్యూ రికార్డుల్లో ఉంది. చెరువు కింద రెవెన్యూ, వ్యవసాయ రికార్డుల ప్రకారం 330 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందిస్తున్నట్లు ఉంది. అయితే వెయ్యి ఎకరాలకు పైబడి ఆయకట్టు ఉంటుందని స్థానిక రైతులు చెప్తున్నారు. పట్టణంతో పాటు అబాది రామగుండం, లింగాపూర్, రాయదండి, పాములపేట, పెద్దంపేట తదితర గ్రామాల ప్రజలకు అనుబంధంగా చెరువు శిఖం ఉంటుంది.

**తగ్గిన నీటినిల్వలు**

ఎన్టీపీసీ, బీ-థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి వెలువడే నీటితో చెరువులో బూడిద నిండిపోయి నీటి నిల్వ ప్రమాణాలు తగ్గిపోయాయి. ఆరేళ్ల క్రితం రూ.50లక్షల వ్యయంతో చెరువులోని పూడిక తీత, కట్టలను బలోపేతం చేసే పనులు చేపట్టినా అసంపూర్తి పనులతో అధోగతి పాలైంది.

**మినీ ట్యాంక్‌బండ్.. ప్రతిపాదనలకే పరిమితం**

పట్టణంలోని పెద్ద చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా తీర్చిదిద్ది టూరిజం సర్క్యూట్‌లో భాగంగా దశాబ్దకాలం క్రితం అభివృద్ధికి ప్రణాళికలు చేసినప్పటికీ స్థానికంగా ప్రజాప్రతినిధి అధికార పార్టీ కాకుండా విపక్ష పార్టీ ప్రతినిధి కావడంతో ఆ ప్రతిపాదన దారిమళ్లింది. దీంతో అప్పటి నుంచి పెద్ద చెరువు అభివృద్ధికి నోచుకోకపోగా చుట్టుపక్కల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పూర్తిగా కబ్జాల పర్వమవుతోంది.

**ప్రతిపాదనలు పంపించాం**

పెద్ద చెరువు మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వానికి రూ.9కోట్లతో ప్రతిపాదనలు పంపించాం. అదే విధంగా చెరువు కబ్జాలపై రెవెన్యూ అధికారులతో సంయుక్తంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ హద్దులు ఏర్పాటు చేసి అక్రమ నిర్మాణాలు తొలగించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నాం.
– కార్తీక్, ఏఈఈ, ఇరిగేషన్ శాఖ

**స్వచ్ఛందంగా ఖాళీ చేయాలి**



నియోజకవర్గంలో అతిపెద్ద చెరువుగా ఎంతో ప్రఖ్యాతి ఉంది. చెరువు శిఖం భూములు అన్యాక్రాంతమవుతున్న విషయం నాదృష్టికి వచ్చింది. హైడ్రా తరహాలో రెవెన్యూ, వ్యవసాయాధికారులతో సంయుక్త సర్వే చేయించి అక్రమ నిర్మాణాలు తొలగిస్తాం. మినీ ట్యాంక్‌బండ్‌గా అభివృద్ధి చేసి నూతన అందాలు తీసుకువచ్చేందుకు కార్యాచరణ చేస్తున్నాం. ఆక్రమణదారులు స్వచ్ఛందంగా చెరువు శిఖం భూములు ఖాళీ చేయాలి. – మక్కాన్‌సింగ్‌ఠాకూర్, ఎమ్మెల్యే, రామగుండం



**మంథనిరూరల్:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ప్రజలకు శాపం మారింది. మంథని మండలం సూరయ్యపల్లిలోని ఎస్సీ వాడలో డ్రైనేజీలు మురికినీటి నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. అలాగే రోడ్డుకు ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడం, పిచ్చిమొక్కలు తొలగించకపోవడంతో వ్యాధులు ప్రబలే ప్రమాదముందని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీల్లో శుభ్రం చేయించి బ్లీచింగ్ చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

**వాట్సాప్ చేయండి..**

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

# రోడ్డు వేశారు.. డ్రైనేజీ మరిచారు

- వర్షం కురిస్తే ఇంట్లోకి చేరుతున్న వరద
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- డ్రైనేజీ నిర్మించాలని కొలనూర్ గ్రామస్తుల వినతి



కొలనూర్‌లో డ్రైనేజీ లేని ప్రధాన రహదారి

**ఓదెల:** మండలంలోని కొలనూర్‌లో ప్రధానరోడ్డు వెంట డ్రైనేజీలు నిర్మించక పోవడంతో దుర్గంధంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ప్రత్యేక కృషితో కొలనూర్‌లో ప్రజల సౌకర్యార్థం డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. కాంట్రాక్టర్ గ్రామంలో పెద్దపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి గ్రామపంచాయతీ వరకు తారురోడ్డు నిర్మాణం పూర్తిచేశారు. రోడ్డు పూర్తి చేయకముందే అర్ధంతరంగా ఆగిపోయింది. అయితే వేసిన రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణం చేపట్టక పోవటంతో వర్షం నీరు, మురికి నీరంతా ఇళ్లలోకి చేరడంతో దుర్గంధం వెదజల్లుతోంది. రోడ్డు ఎత్తు పెరగడంతో గ్రామంలోని ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఉండడంతో వరద నీరంతా తమ ఇళ్లలోకే వస్తోందని గ్రామస్తులు మాటేటి పోశాని, మాటేటి వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పూర్తిచేసి డ్రైనేజీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



పోశాని ఇంట్లోకి చేరిన మురికినీరు (ఫైల్)



ఇళ్ల పక్కనే నిలిచిన వరద నీరు (ఫైల్)

## 20రోజులైనా రోడ్డుపై నిలుస్తున్న వరద

**ఎలిగేడు:** ఇటీవల కురిసిన వర్షాలకు మండల కేంద్రంలోని 7వ వార్డులో సీసీరోడ్డుపై వరద నీరు నిలిచింది. దీంతో ఆ రోడ్డు మీదుగా వెళ్లే బాటసారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే వరద నీరు 20రోజుల వరకు అలాగే నిలిచి ఉంటుందని.. రోడ్డుపై వెళ్లేదెలా అని స్థానికులు వాపోతున్నారు. సీసీరోడ్డుపై నీరు నిలిచి దోమలు వృద్ధి చెంది రోగాల పాలవుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మించే సమయంలో ఎత్తు పెంచక పోవడంతో వర్షపునీరు నిలుస్తోందని వార్డు ప్రజలు వాపోతున్నారు. నిల్వ నీటిని తొలగించేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై నీటిని తొలగించి తమ సమస్యను పరిష్కరించాలని వార్డు ప్రజలు వేడుకుంటున్నారు.



సీసీరోడ్డుపై నిలిచిన వర్షం నీరు (ఫైల్)

## కాంట్రాక్టు ఉద్యోగులు గ్రాట్యుటీకి అర్హులు

**జ్యోతినగర్:** కాంట్రాక్టు ఉద్యోగులు గ్రాట్యుటీకి అర్హులని ఎన్టీపీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు ఆకుల రాంకిషన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రాట్యుటీ చెల్లింపు చట్టం 1972 కిందకు వస్తారని వారు నిర్ధారించుకోవాలి సూచించారు. ఈ చట్టం ప్రకారం, ఒక ఉద్యోగి కనీసం ఐదేళ్లు ఒకే సంస్థలో పనిచేసి, నిష్క్రమించినప్పుడు గ్రాట్యుటీ చెల్లించాలి. గ్రాట్యుటీ చెల్లించే బాధ్యత యజమానిపై ఉంటుందని పేర్కొన్నారు.

**గ్రాట్యుటీకి అర్హతలు..**

- ✦ ఉద్యోగి ఒకే కంపెనీలో కనీసం 5 సంవత్సరాలు పనిచేసి ఉండాలి.
- ✦ ఉద్యోగి ఉద్యోగ విరమణ చేయాలి లేదా రాజీనామా చేయాలి.
- ✦ గ్రాట్యుటీ లెక్కించడానికి చివరి నెలలో తీసుకున్న జీతం (మూల వేతనం, డియర్‌నెస్ అలవెన్స్) ఆధారంగా ఉంటుంది.
- ✦ ప్రతీ అర్హత గల సేవ సంవత్సరానికి 15 రోజుల వేతనం లెక్కించబడుతుంది.

కాంట్రాక్ట్ ఉద్యోగి అనే పదాన్ని గ్రాట్యుటీ చెల్లింపు చట్టం 1972లో అర్హత ఉన్నాడో లేదో అని ఉద్యోగి చట్టం పరిధిలో ఉద్యోగిగా పరిగణించబడుతున్నాడా లేదా అనేదానిపై ఆధారపడి ఉంటుంది. పూర్తి వివరాలకు కోఆర్డినేటర్ ఆకుల రాంకిషన్ 94409 18331 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

## సంక్షిప్త వార్తలు

**• ఎన్టీపీసీ భూనిర్వాసిత ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు కల్పించాలి**

**జ్యోతినగర్:** పదేళ్ల కంటే తక్కువ సర్వీసు ఉన్న ఎన్టీపీసీ భూనిర్వాసిత ఉద్యోగులకు వైద్య సౌకర్యాలు కల్పించాలని ఎన్టీపీసీ చైర్మన్, హెచ్‌ఆర్ డైరెక్టర్లకు వినతిపత్రం పంపించినట్లు ఎన్టీపీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రేవా) అధ్యక్షుడు ఆకుల రాంకిషన్, ప్రధాన కార్యదర్శి సత్తు ముత్యాలు, సంయుక్త కార్యదర్శి శ్రీపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీపీసీ ఉద్యోగులు, జీవిత భాగస్వామికి సర్వీసులో ఉన్నప్పుడు, ఉద్యోగ విరమణ తర్వాత కూడా వైద్య సౌకర్యాలు అందిస్తోందన్నారు.

**• అనారోగ్యంతో ఆటోడ్రైవర్ మృతి**

**జ్యోతినగర్:** ఎన్టీపీసీ రామగుండం కార్పొరేషన్ మల్కాపూర్(రామయ్యపల్లె)కు చెందిన ఆటోడ్రైవర్ తోట శ్రీనివాస్(54) అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం సంజీవ్ ఆటో నడుపుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. కొన్నిరోజుల క్రితం అనారోగ్య సమస్యలు రావడంతో గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడికి ఒక కుమార్తె, భార్య ఉన్నారు. పేద కుటుంబం కావడంతో ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**• వాహనాల తనిఖీ**

**ఓదెల:** మండలంలోని పలు గ్రామాల్లో పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ ఆధ్వర్యంలో ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందుర్తి, శానగొండ, గుంపుల, గూడెం, కొమిర గ్రామాల్లో ఎస్సై ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేసి అనుమతి పత్రాలు వారికి జరిమానా విధించారు.

**• మృతుడి కుటుంబానికి పరామర్శ**

**పెద్దపల్లిరూరల్:** మున్సిపాలిటీ కార్మిక సంఘం అధ్యక్షుడు ఆరెపల్లి చంద్రయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించారు. కాగా ఆదివారం మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మమతారెడ్డి మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. మాజీ సర్పంచ్ తీగల సదయ్య, నాయకులు కుమార్, రాజేందర్ ఉన్నారు.

### నేడు యూరియా కోసం ధర్నా

**సుల్తానాబాద్:** రైతులకు యూరియా సరఫరా చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని పేర్కొంటూ మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట సోమవారం ఉదయం 10 గంటలకు ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీటీసీ సూరశ్యామ్, సింగిల్ విండో ఇన్‌చార్జి చైర్మన్ జూపల్లి సందీప్‌రావు తెలిపారు. కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని వారు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పట్టణ, మండల నాయకులు, రైతులు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

### అన్నదాతలకు యూరియా పంపిణీ

**జూలపల్లి:** మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం పరిధిలోని రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి ప్రత్యూష తెలిపారు. డీసీఎంఎస్ ద్వారా చీమలపేటలో 10 టన్నులు, పీఏసీఎస్ జూలపల్లి గోదాం నుంచి 40 టన్నులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. చీమలపేటతో పాటు నాగులపల్లె, తేలుకుంట, కుమ్మరికుంట, కోనరావుపేట, అబ్బాపూర్‌కు చెందిన 320 మంది రైతులకు అందజేసినట్లు వెల్లడించారు.

**పాలకుర్తి మండలంలో..**

**పాలకుర్తి:** మండల కేంద్రంతో పాటు ఈసాలతక్కళ్లపల్లి గ్రామ రైతులకు శనివారం యూరియా పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయాధికారి బండి ప్రమోద్‌కుమార్ తెలిపారు. జయ్యారం క్లస్టర్ ఏఈవో యోజన ఆధ్వర్యంలో మొత్తం 15టన్నుల యూరియాను 162మంది రైతులకు, అదేవిధంగా 75మంది రైతులకు నానో యూరియా బాటిళ్లు అందించినట్లు ఏవో పేర్కొన్నారు.

### వ్యాసరచన పోటీలకు ఆహ్వానం

**యైటింక్లయిన్‌కాలనీ:** శ్రీసత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీలు నిర్వహించనున్నట్లు సేవాసమితి జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, యైటింక్లయిన్‌కాలనీ కన్వీనర్ నూక రమేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 'కృతజ్ఞత పరిపూర్ణ జీవనానికి మార్గం' అనే అంశంపై 8, 9, 10వ తరగతుల పాఠశాల స్థాయి విద్యార్థులకు, «వర్తమానంలో మన నడవడి మన భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది» అనే అంశంపై ఇంటర్, డిగ్రీ స్థాయి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసిన మొదటి ముగ్గురు విజేతలకు ప్రశంసా పత్రాలతో పాటు రాష్ట్రస్థాయి మొదటి విజేతకు స్వర్ణపతకంతో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అన్ని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



### కోతకు గురైన రోడ్డు.. వాహనదారులు పైలం

**ఓదెల:** ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కొలనూర్-ఓదెల గ్రామాల మధ్య ప్రధాన రహదారి కోతకు గురై ప్రమాదకరంగా మారింది. రోడ్డు పక్కనే కుంట ఉండటంతో వర్షం వరదకు తారురోడ్డు కోతకు గురైంది. దీంతో కోతకు గురైన ప్రాంతంలో ఎదురుగా వాహనం వస్తే మరో వాహనం అదుపుతప్పి ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. చర్యలు తీసుకోవాల్సిన అధికారులు రిబ్బెన కట్టి నామమాత్రం వ్యవహరించడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానిక ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. తారురోడ్డు నిర్మించిన కాంట్రాక్టర్ స్పందించి అదనపు నిధులతో కోతకు గురైన రోడ్డుకు మరమ్మతు చేయాలని ఓదెల మండల ప్రజలు కోరుతున్నారు.



**ప్రమాదకరంగా గుంత**

**కమాన్‌పూర్:** మండల కేంద్రంలోని శ్రీపాద చౌరస్తా వద్ద మూలమలుపు వద్ద జూలపల్లి గ్రామం వైపువెళ్లే దారిలో గతంలో మిషన్ భగీరథ పైపులైన్ కోసం తారురోడ్డును జేసీబీతో తవ్వించి పైపులైన్ వేశారు. ప్రస్తుతం మూలమలుపు దారిపై ఏర్పడిన గుంతలో ఇటీవల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు చోటు చేసుకున్నాయి. గుంతపూడ్చి వేయించాలని వాహనదారులు కోరుతున్నారు.

### జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



అభినందిస్తున్న విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్

**పెద్దపల్లిరూరల్:** పెద్దపల్లిలోని గాయత్రీ డిగ్రీ, పీజీ కాలేజీ విద్యార్థి పిడుగు శ్రీకాంత్ (పెద్దపల్లి మండలం అప్పన్నపేట) జాతీయస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. ఇండియా ఇంటర్ యూనివర్సిటీ బటిన్న గురుకాశీ యూనివర్సిటీలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో శాతవాహన యూనివర్సిటీ తరఫున ప్రాతినిధ్యం వహించి పతకం సాధించాడు. కాలేజీలో జరిగిన కార్యక్రమంలో శ్రీకాంత్‌ను గాయత్రీ విద్యాసంస్థల అధినేత శ్రీనివాస్ అభినందించారు. ప్రిన్సిపాల్ రవీందర్ ఉన్నారు.